సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 25 । మార్చి । 2023



అడ్డంకులు తొలగేనా?
అలంపూర్ అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు, అవరోధాలు ఎదురవుతున్నాయి.

వివరాలు 8లో ▸



నల్లమట్టి దందా..
నల్లమట్టితో రూ.కోట్లు కొల్లగొడుతున్నారని బీఎస్పీ చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /23.0

వాతావరణం
ఉదయం వేళలో ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-28 (శనివారం సాయంత్రం)

సహర్ 4-58 (ఆదివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

నేడు నాగర్‌కర్నూల్ బంద్

నాగర్‌కర్నూల్ రూరల్: మన్ననూరు గురుకుల పాఠశాలలో మృతిచెందిన విద్యార్థి నిఖిత మృతికి నిరసనగా శనివారం నాగర్‌కర్నూల్ పట్టణ బంద్ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ అఖిల పక్ష నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నిఖిత మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బంద్ అనంతరం నిరసన కార్యక్రమాలు చేపడుతామని, కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలియజేశారు. బంద్‌కు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

కందనూలు: పోషకాహార విలువలతో కూడిన చిరుధాన్యాల ప్రాముఖ్యతపై జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత సమతుల్యం, ఆరోగ్యంగా ఉండటానికి చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పోషక అభియాన్ పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వాటి ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించాలని సూచించారు. నిర్వహించిన పోటీల వివరాల ఫొటోలను జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డికి పంపించాలని సూచించారు. ఆధునిక ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతిఒక్కరూ మంచి ఆహారానికి దూరమవుతున్నారని, చిరుధాన్యాల అవసరాన్ని వివరించడంతో పాటు పోషక విలువలున్న ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య విషయాలను తరగతి గదుల్లో ఎప్పటికప్పుడు గమనిస్తూ... పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. బాలికల్లో రక్త హీనత శాతం నివారించడానికి సమతుల్య ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటేనే విద్యార్థులు చదువులపై దృష్టి సారించగలుగుతారన్నారు.

29న తైబజార్ వేలం

కందనూలు: నాగర్‌కర్నూల్ పురపాలక సంఘం తైబజార్(రోజువారి మార్కెట్) వేలం నాగర్‌కర్నూల్ పురపాలక సంఘం కార్యాలయంలో 2023–24 సంవత్సరానికి గాను ఈ నెల 29న బుధవారం ఉదయం 11:30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తైబజార్ వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు సొమ్ము రూ.5 లక్షలు కమిషనర్, పురపాలక సంఘం నాగర్‌కర్నూల్ పేర ఏదేని బ్యాంకు డీడీ ద్వారా సమర్పించాలన్నారు. డీడీతో పాటు రూ.30 లక్షల విలువ చేసే వాల్యుయేషన్ సర్టిఫికెట్ జతపరిచి ఈ నెల 28న మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు పురపాలక సంఘం కార్యాలయంలో దరఖాస్తుతో పాటు బ్యాంకు డీడీని జత చేసిన రశీదుతో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు నాగర్‌కర్నూల్ పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సమస్యల సాధనకు 'చలో విద్యుత్ సౌధ'

దోమలపెంట(అచ్చంపేట): తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకు చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి భూగర్భ విద్యుత్ కేంద్రం ఉద్యోగులు, ఆర్టిజన్లు శుక్రవారం ఉదయం తరలివెళ్లారు. ప్రధానంగా వేతన సవరణ 2022, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, ఆర్టిజన్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సౌధ వద్ద మహాధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు టీఎస్‌పీఈజేఏసీ రీజియనల్ నాయకులు సునీల్, యాదయ్య, పాండునాయక్ తదితరులు తెలియజేశారు.



మామూళ్ల పర్వం

'జిల్లాలోని ఉప్పునుంతల మండల పరిధిలోని దుందుభీ వాగు తీరం నుంచి నిత్యం ట్రాక్టర్ల కొద్దీ ఇసుక లూటీ అవుతోంది. అక్రమ ఇసుక దందాకు సంబంధిత అధికారులు బహిరంగంగానే సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు పోలీసులు ఇసుక అక్రమ వ్యవహారం తమకు సంబంధం లేదని చెబుతూనే, మామూళ్లు ఇవ్వని కారణంగా మండలంలోని ఓ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని సెల్‌ఫోన్ లాక్కొని, గంటల తరబడి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి వేధింపులకు దిగడం గమనార్హం.'

- ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి పోలీసుల వసూళ్లు
- ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.15 వేల చొప్పున దండుకుంటున్న వైనం
- కట్టడి మా పరిధి కాదంటూ బుకాయింపు
- దారికి రాని ట్రాక్టర్ యజమానులపై వేధింపులు



ఉప్పునుంతల మండలం సదగోడు శివారులో ఇసుక నిల్వలు



ఉప్పునుంతల మండలం దుందుభీ తీరం నుంచి క్యూ కట్టిన ఇసుక ట్రాక్టర్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని దుందుభీ వాగు తీరం వెంట ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఉప్పునుంతల మండలంలోని మొల్గర, జప్తిసదగోడు, పెద్దాపూర్, దాసర్లపల్లి గ్రామాల శివారులోని దుందుభీ వాగు నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా సాగుతుండగా.. సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సాండ్ టాక్సీ విధానాన్ని నీరుగారుస్తూ అక్రమ దందాకు తెరలేపడం విమర్శలకు దారితీస్తోంది. ఇసుక అక్రమార్కుల నుంచి పెద్దఎత్తున మామూళ్ల రూపంలో వసూళ్లకు పాల్పడుతూ సంబంధిత అధికారులు బహిరంగంగానే దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాక్టర్ల యజమానుల మధ్య వివాదం..

జిల్లాలోని ఉప్పునుంతల మండలంలోని కొరటికల్, తిర్మలాపూర్, కంసానిపల్లి గ్రామాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాంల కారణంగా నీటి నిల్వ ఉండటంతో ఇసుక తవ్వకాలకు వీలులేకుండా పోయింది. దీంతో ప్రధానంగా మండలంలోని మొల్గర, సదగోడు, పెద్దపూర్, దాసర్లపల్లి గ్రామాల వద్దనున్న దుందుభీ వాగు తీరం నుంచే ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం సుమారు 80కి పైగా ట్రాక్టర్లు ఇసుక అక్రమ రవాణాలో నిమగ్నమవుతున్నా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. జేసీబీలు, ట్రాక్టర్లతో టన్నుల కొద్దీ ఇసుకను ఇతర మండలాలకు తరలిస్తున్నారు. అయితే తమ గ్రామాల్లోని ఇసుకను తామే తీసుకుంటామని స్థానికులకు, ఇతర గ్రామాల ట్రాక్టర్ యజమానులకు మధ్య వివాదం కొనసాగుతోంది. మరోవైపు అధికారులు మాత్రం అభివృద్ధి పనులకే ఇసుక తరలింపు కొనసాగుతోందని చెబుతూ అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...

ఇసుక అక్రమ రవాణా కట్టడిపై ఇటీవల సమావేశం నిర్వహించాం. రెవెన్యూ, మైనింగ్ అధికారుల సహకారంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ప్రభుత్వ అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుకను వినియోగించేలా చూస్తాం. రాత్రివేళ ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– అనుదీప్, సీఐ, అచ్చంపేట

నెలవారీ మామూళ్లు..

ఉప్పునుంతల మండలంలోని దేవదారికుంట, తాడూరు గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు మాత్రమే సంబంధిత తహసీల్దార్ నుంచి అనుమతులు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని సీసీ రోడ్డు, పంచాయతీ భవన నిర్మాణానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే నిబంధనల మేరకు ఇసుకను తరలించాలి. అయితే మండల పరిధి దాటి అచ్చంపేట, బల్మూర్, లింగాల, తెలకపల్లి మండలాలకు విచ్చలవిడిగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఇసుక రవాణా రెవెన్యూ, మైనింగ్ శాఖలకు సంబంధించిన అంశం, తమకేం సంబంధం ఉండదు అంటూనే పోలీసులు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి నెలకు రూ.15 వేల వరకు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉప్పునుంతల మండల కేంద్రంలోని ఓ పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న షాపు నిర్వాహకుని ద్వారా ట్రాక్టర్ యజమానుల నుంచి నెలవారీ వసూళ్లు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇలా నెలకు రూ.30 లక్షల వరకు వసూలవుతున్నట్టు సమాచారం. రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టారీతిగా ఇసుక దందా కొనసాగుతుండగా సంబంధిత అధికారులు మాత్రం తమకు కాసుల దందాగా మార్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: జిల్లాలో 420 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన కింద కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ తెలియజేశారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ అనంతరం గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారికి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆయా మండలాల్లో 69 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి కేటాయింపులు జరగనందున, తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల మేరకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో కంటి వెలుగు విజయవంతంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు 3,27,912 మందికి కంటి పరీక్షలు పూర్తి చేశామన్నారు. 31,652 మందికి దగ్గరి చూపు అద్దాలు ఇచ్చామని, దూరపు చూపు అద్దాలు 22,900 వచ్చాయని, ఇప్పటి వరకు 12,476 పంపిణీ చేశామన్నారు. 2,93,360 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేనట్లు గుర్తించామన్నారు. వడగాల్పులు, అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మనూచౌదరి, మోతీలాల్, డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ పట్నం మహేందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో లేని పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని, ఇక్కడ అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఇచ్చేందుకు తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాలు, మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని దేశ అభివృద్ధి కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆత్మీయ సమ్మేళనాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ ఏ పథకాలు అమలు చేసినా.. కొంతమందికి మాత్రమే చేరేవని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలందరికీ చేరుతున్నాయన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. గతంలో రైతుల ఆత్మహత్యలు ఉండేవని, కేసీఆర్ రైతుబంధు అమలుచేసి రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. శ్రీనివాస్ యాదవ్, జక్కా రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఎందుకు హాజరుకారు?



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతాకుమారి

- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ శాంతాకుమారి ఆగ్రహం
- విద్యుత్ చౌర్యం చేస్తే కేసులు – ప్రభుత్వ విప్ గువ్వల బాల్‌రాజు
- వైద్యశాఖ నిర్లక్ష్యంపై అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

కందనూలు: ముఖ్యమైన సమావేశాలకు అధికారులు తరచూ గైర్హాజర్ కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్ శాంతా కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.జే.ఆర్ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీచైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, అదనపు కలెక్టర్ మనూ చౌదరి హాజరయ్యారు. అతి ముఖ్యమైన ప్రజాసంబంధ శాఖలపై ముందుగా చర్చ చేపట్టారు. వ్యవసాయం, మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ శాఖ, విద్యుత్, మెడికల్ ఆస్పత్రి, విద్య, సాంఘిక సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖలపై వాడీవేడిగా చర్చించారు.

➡ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి తమ కింది స్థాయి అధికారులను కాకుండా జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ శాంత కుమారి తెలియజేశారు. సమావేశాలకు అన్ని శాఖల తరపున అధికారులు హాజరయ్యేలా, జిల్లా అధికారులు చొరువ చూపాలన్నారు.

బిల్లులు ఎలా వసూలు చేస్తారు..

కరెంట్ సరఫరా లేకుండా బిల్లులు ఎలా వసూలు చేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. దీంతో పదర మండలంలోని చిట్లగుంటపల్లిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో 40 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు అక్కడికి వెళ్లి సమస్య ఎక్కడ ఉందో చూడాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ ద్వారా ఇంకా ఎక్కడైన నల్లా కనెక్షన్లు, లైన్లు ఇవ్వని ప్రాంతాల్లో వెంటనే పనులు పూర్తిచేయాలని సూచించారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటు చాలా ఆలస్యం జరుగుతుందని, ఓవర్ లోడ్ సమస్య లేకుండా చూడాలని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, విద్యుత్ శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఏ సమస్య ఉన్న త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా బదులిచ్చారు. చెంచులు ప్రతి సంవత్సరం సలేశ్వరం జాతర 15 రోజులు ఘనంగా జరుపుకుంటారని, దానిని ఈసారి రెండు రోజులకు కుదించడం సరికాదన్నారు.

వైద్యసేవలో మార్పు లేదు..

జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు అయినప్పటికిని వైద్యసేవలో పెద్దగా మార్పు రాలేదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంజూరైన వైద్య పోస్టులను సకాలంలో భర్తీ చేసే ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తున్నారని, జిల్లా వైద్య అధికారి సుధాకర్‌లాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోజువారీ అవుట్ పేషెంట్ల సంఖ్య పెరగాలని, అప్పుడే ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లపై నమ్మకం పెరుగుతుందన్నారు. సబ్ సెంటర్ల మరమ్మతుకు సంబంధించి త్వరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్‌కు సూచించారు. తెలకపల్లి ఎంపీపీ మధు, పెద్దకొత్తపల్లి జెడ్పీటీసీ గౌరమ్మ, వెల్దండ జెడ్పీటీసీ విజితా రెడ్డి, బల్మూర్ ఎంపీపీ అరుణ తమ మండల పరిధిలోని తాగునీరు, విద్యుత్ సమస్యలను సభా దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మనూచౌదరి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాధులపై రస్తా..!



'మా నాన్న, అమ్మ చనిపోయి 18 సంవత్సరాలు కావొస్తోంది. వీరు చనిపోయిన మూడు, నాలుగేళ్లకే మా తమ్ముడు, మరదలు చనిపోయారు. వీరందరి సమాధులు తాళ్లచెరువు కట్టపైనే పెట్టాం. ప్రతి ఏటా పెద్దలకు పెట్టుకునేటప్పుడు, పండగ పూట కుటుంబసభ్యులమందరం సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించుకునే వాళ్లం. ప్రస్తుతం అవకాశం లేకుండా పోయింది. అసలు ఆనవాళ్లే లేకుండా చేశారు. ప్రజాప్రతినిధులను అడిగితే న్యాయం చేస్తామన్నారు. ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు. అభివృద్ధి చేస్తే కాదనేది లేదు. కానీ.. మా నమ్మకాన్ని వమ్ము చేయడం, మనోభావాలు దెబ్బతీయడం కరెక్ట్ కాదు కదా..' అని వనపర్తిలోని మారెమ్మకుంట చెందిన ఎ.రంగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇతని ఒక్కని పరిస్థితే కాదు.. తమ పూర్వీకుల ఆనవాళ్లను చెరిపేశారని వందలాది కుటుంబీకులు మదన పడుతున్నారు.

మంత్రి ఇలాకా 'వనపర్తి'లో ఘనకార్యం

- రోడ్డు విస్తరణ పేరిట 'గుర్తులు' చెరిపేసి..
- బీసీ, ఎస్సీల మనోభావాలతో ఆటలు
- తాళ్లచెరువు కట్ట ఆధునికీకరణలో ఒంటెద్దు పోకడలు
- బడుగు, బలహీన వర్గాల నుంచి విమర్శల వెల్లువ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాలం చేసిన వారి జ్ఞాపకార్థం సమాధులు నిర్మిస్తారు. పూర్వీకులను స్మరించుకుంటూ ప్రతి ఏటా పెద్దల పండగ చేసుకుంటారు. సమాధులకు పుష్పాలంకరణతో పాటు వారికి ఇష్టమైన నూతన వస్త్రాలు పెట్టి, పిండి పదార్థాలు, ఇతర వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. మరణించిన వారు తమతోనే ఉంటారు.. వారి ఆశీస్సులు ఉండాలి.. వంశాన్ని కాపాడతారు అనేది ఆయా కుటుంబీకుల భావన. నమ్మకం అనే పునాదిపై ఏర్పడిన సమాధులు, వాటి జ్ఞాపకాలను చెరిపేసి.. ప్రజల మనోభావాలతో ఆటలాడుకుంటున్నారు. అడిగేవారు లేరనే ధీమాతో సమాధులపైనే రోడ్డు వేశారు. ఇది ఎక్కడో కాదు.. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వనపర్తి నియోజకవర్గంలోనే జరిగింది.

విమర్శల వెల్లువ..

ఎస్టిమేషన్ లేకుండానే తాళ్లచెరువు ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు చేపట్టారు. 2021 ఆగస్టులో పనులు ప్రారంభం కాగా.. గతేడాది ఫిబ్రవరిలో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ తర్వాతే పరిపాలనాపరమైన అనుమతులు లభించాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సమాధులపై రోడ్డు వేసి బీసీల, ఎస్సీల మనోభావాలు దెబ్బతీశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సమాధులను చదును చేసి వేసిన రోడ్డు

10 వేలకు పైగా సమాధులు..

వనపర్తి–పాన్‌గల్ రహదారిలోని తాళ్ల చెరువు కట్టపై నుంచి కింది భాగంలో సమాధులు ఉండేవి. సంస్థానాధీశుల కాలం నుంచి ఆ స్థలాన్ని సమాధుల కోసమే వినియోగిస్తున్నారు. గాంధీ చౌక్, పెద్దమ్మ గుడి, హనుమాన్ టెక్డి, పాతకోట, దళితవాడ, గాంధీనగర్, భగత్‌సింగ్ నగర్ కొంత భాగం, రామ థియేటర్ రోడ్డు, పాతూరు, రాయిగడ్డ, పాత ఇకో బ్యాంకు, కేటీఆర్ నగర్, వల్లభ్‌నగర్, పాత బజార్, చాటగడ్డ, సాకల్‌గేరి, బాపన్‌గేరి ప్రాంతానికి చెందిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు మరణించిన తమ కుటుంబసభ్యుల జ్ఞాపకార్థంగా ఇక్కడే సమాధులు కట్టుకుంటున్నారు. అయితే శ్మశానవాటిక నిర్మించిన తర్వాత ఇక్కడ కొత్తగా సమాధులు కట్టడం ఆగిపోయింది. కానీ.. ఆయా కుటుంబాల్లో ఎవరు చనిపోయినా ఆయా సమాధుల్లోనే మృత దేహాలను పూడ్చిపెడుతున్నారు. ఇక్కడ సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు సమాధులు ఉన్నట్లు అంచనా. అయితే తాళ్లచెరువు సుందరీకరణలో భాగంగా కట్టపైన, కట్ట కింది భాగంలో ఉన్న సమాధులను అలానే ఉంచి మట్టిపోశారు. పెద్ద ఎత్తున మట్టిపోసి సిమెంట్ రోడ్డు వేశారు. పాన్‌గల్ రోడ్డును, కాశంనగర్ రోడ్డును లింక్ చేసేలా సమారు ఆరు నెలల క్రితమే తాళ్లచెరువు కట్టపై రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీనికి ఎస్‌ఎన్‌ఆర్ మార్గ్‌గా నామకరణం చేయడం విశేషం.

ఎలాంటి అభ్యంతరాలు రాలేదు

తాళ్లచెరువు కట్ట బ్యూటిఫికేషన్, సీసీరోడ్డు నిర్మాణం సమయంలో సమాధులపై మట్టి వేసే క్రమంలో ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. ఏళ్లుగా తుమ్మలు మొలిచిన కట్టను రెండు ప్రధాన రోడ్లకు లింక్ చేస్తూ.. ప్రయాణం సులభతరం చేయాలనే సదుద్దేశంతోనే పనులు చేశాం. సమాధులను తొలగించలేదు. మట్టికిందనే ఉన్నాయి.

– భరత్, ఏఈ, నీటిపారుదలశాఖ, వనపర్తి

'ఆత్మీయ సమ్మేళనం' ప్రచారంతో తెరపైకి..

తాళ్లచెరువు కట్ట మీదనే భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శనివారం వనపర్తి పరిధిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని అనుకున్నారు. అనివార్య కారణాలతో ఇది వాయిదా పడగా.. రంజాన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలోనే ఇఫ్తార్ విందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులు సైతం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ తాళ్ల చెరువు కట్టపైనే నిర్వహించాలని తలపెట్టిన క్రమంలో సమాధుల అంశం తెరపైకి వచ్చింది. సమాధుల ఆనవాళ్లే లేకుండా పోయాయని.. ఇక్కడ అందరూ ఎస్సీలు, బీసీలేనని.. సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించి తమ విశ్వాసాలను దెబ్బతీయడం ఎంత వరకు సమంజసమో నేతలు, అధికారులు స్పష్టం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో కట్టుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారని.. పాలకులు హామీని నిలబెట్టుకోవాలని కొందరు కోరుతున్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మెరిసిన దంపతులు

కందనూలు: జిల్లాకు చెందిన ఖాద్రి పాషా, ఫాజియ దంపతులకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏకకాలంలో పీహెచ్‌డీ చేయటానికి ప్రవేశం లభించింది. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్షలో ఖాద్రి పాషాకు లింగ్విస్టిక్స్‌లో రెండో ర్యాంకు, ఫాజియాకు గణిత శాస్త్రంలో మూడో ర్యాంకు సాధించి పరిశోధనకు అర్హత పొందారు. ఈ మేరకు యూనివర్సిటీ వారు ఉత్తర్వులు పంపినట్లు వారు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరుకు చెందిన ఖాద్రీపాషా భాషా శాస్త్రంలో ఎంఫిల్ చేశారు. ఫౌజియా నాగర్‌కర్నూల్‌లో విద్యాభ్యాసం చేశారు. వీరు ఇరువురు సాధించిన ర్యాంకుపై పలువురు విద్యావేత్తలు అభినందించారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి బాలుడి మృతి


అఫ్రోజ్‌ఖాన్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: బైక్ అతివేగంగా నడిపి విద్యుత్ స్తంభానికి ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంసభ్యులు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అఫ్రోజ్ ఖాన్ (15) తన ఇద్దరు స్నేహితులతో కలిసి పంజుగుల రోడ్డులో తన తండ్రి బైక్ తీసుకునివెళ్లాడు. పంజుగుల రోడ్డులో బైక్‌ను అతివేగంగా నడపటంతో బ్రేకులు వేసిన అదుపుకాకపోవటంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. బైక్ అదుపుతప్పుందన్న విషయాన్ని గ్రహించిన తన మిత్రులు వేగంగా ఉన్న సమయంలోనే బైక్‌పై నుంచి కిందకు దూకేశారు. బైక్‌ను నడుపుతున్న అఫ్రోజ్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న తన స్నేహితుల వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తి..

మల్దకల్: ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. మండల కేంద్రం నుంచి పరశురాముడు తన బైక్‌పై గద్వాలకు వెళ్తుండగా మార్గమధ్యలోని సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో గద్వాల నుంచి పెంచికలపాడుకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటలో బైక్‌పై వెళ్తున్న పరశురాముడు(38) అక్కడికక్కడే మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ నాయక్ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మరొకరు..

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యాదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లవెల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వీణారెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మంతయ్య (41) తన వ్యవసాయ పొలానికి వెళ్తుండగా సమీపంలోని మరో వ్యవసాయపొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గౌరమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి రిమాండ్

గద్వాల క్రైం: ప్రేమపేరుతో బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బాలికను కర్నూల్ జిల్లా దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన సుధీర్ ఈ నెల 13వ తేదీన తన తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. దీంతో కూతురు కిడ్నాప్‌కు గురైందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణలో సుధీర్ తీసుకెళ్లినట్లు గుర్తించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విచారణ అనంతరం శుక్రవారం గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖిల్లాఘనపురంలో..

ఖిల్లాఘనపురం: బాలికను ప్రేమపేరుతో కిడ్నాప్ చేసిన యువకుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. బాలికను మండలంలోని మానాజీపేటకు చెందిన యువకుడు ప్రేమపేరుతో మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. వెంటనే గుర్తించి బాలికను తీసుకవచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. యువకుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధికి అడ్డంకులు తొలిగేనా?


అప్రోచ్ రోడ్డుకు అడ్డుగా ఉన్న నివాస గృహాలు

- రూ.36.37కోట్లతో ప్రసాద్ స్కీం పనులు
- ఆక్రమణలు, అడ్డంకులు, అభ్యంతరాలతో నత్తనడకన పనులు

జోగుళాంబ శక్తిపీఠం: కేంద్ర ప్రభుత్వం అలంపూర్ పట్టణాన్ని అధునాతన వసతులతో అభివృద్ధి చేసేందుకు రూ.36.37 కోట్లతో ప్రసాద్ స్కీం పనులను చేపట్టింది. రెండేళ్లుగా కొనసాగుతున్న మొదటి విడత పనులకు అడ్డంకులు, ఆక్రమణలు, అభ్యంతరాల మధ్య పనులకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తే ఈ సమస్యలను అధిగమించి పనుల వేగం పెంచొచ్చు. రాజకీయ ప్రతినిధులు పలుమార్లు వచ్చినా, సమస్యను పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై పనులు సాగడం లేదు.

రాష్ట్రానికే తలమానికంగా..

అభివృద్ధి కోసం కేంద్రం రూ.76 కోట్లు ఇవ్వగా, ఆయా నిర్మాణాల పనులకు స్థలం చూయించడంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం కావడంతో కాస్తా రూ.50 కోట్లకే కుదించబడ్డాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలకు కేవలం రూ.36.37కోట్లకే పరిమితం చేశారు. మంజూరైన ఈ నిధుల నుంచి చేపట్టాల్సిన పనులలో కూడా తరుచుగా పలు ఇబ్బందులు ఎదురుకావడంతో కాంట్రాక్టర్లకు ఇబ్బందిగా మారింది.

ప్రధాన సమస్యలు

తుంగభద్ర నది బ్రిడ్జి వద్ద 4 ఎకరాలు 2 గుంటల స్థలంలో నిర్మించాల్సిన మినీ బస్ డిపోకు స్థానికుల నుంచి ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిర్మాణ ప్రాంతం తమకు చెందిన స్థలంగా కొందరు అడ్డుకోగా, మరి కొంతమంది ఆ స్థలంలో తమ పొలాలకు పారే నీటి పైపులైన్ ఉందంటూ తరుచూ పనులకు అడ్డుతగులుతున్నారు. ఆలయాల వద్ద పార్కింగ్ టైల్స్, హైమాస్ట్ లైట్, ప్రహరీ నిర్మాణాలకు ఒక వైపు కేంద్ర పురాతత్వ శాఖ నిబంధనల పేరిట అడ్డుతగులుతుండగా, మరో వైపు ఆలయ సమీపంలోని కొంతమంది నివాస గృహాల వారు ఇటీవల తాము కోల్పోయిన ఇళ్లకు పూర్తి నష్టపరిహారం ఇవ్వడం లేని అభ్యంతరం చెబుతున్నారు. అదే విధంగా ప్రసాద్ స్కీం భవనం సముదాయం నుంచి ఆలయ పుష్కరఘాట్ వరకు వేయాల్సిన అప్రోచ్ రోడ్డు వచ్చే మార్గంలో కొన్ని నివాస గృహాలు స్థలాన్ని ఆక్రమణ చేశారని పర్యాటక శాఖ అధికారుల వాదన. పలు రకాల సమస్యల సుడిగుండం మధ్య ఈ అభివృద్ధి పనులు వేగంగా కావాలంటే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

దుకాణాల తొలగింపు ఉద్రిక్తం


రోడ్లపై ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


తొలగించవద్దని రాస్తారోకో చేస్తున్న చిరు వ్యాపారులు

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విక్రయాలు చేపట్టాలని మున్సిపల్ కమిషన్ ఆదేశం
- తరలేందుకు చిరు వ్యాపారుల విముఖత.. రాస్తారోకో

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద రోడ్లు ఆక్రమించుకొని చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు యత్నించగా వారికి.. దుకాణ యజమానులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక్కడే తమ వ్యాపారాలు కొనసాగిస్తామని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విక్రయాలు జరగవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాస్తారోకోకు దిగారు. పూర్తి వివరాలిలా.. ఇక నుంచి చుట్టు పక్కల గ్రామాల నుంచి కూరగాయాలు, ఆకు కూరలు తీసుకొచ్చే రైతులందరూ రైతుబజార్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కాకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ సునీత వారం రోజుల కిందట ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం వారిని మున్సిపల్ సిబ్బంది అడ్డుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు వెళ్లాలని పట్టుబట్టారు. రైతులు తెచ్చిన కూరగాయాలను ఇంటిగ్రేటెడ్‌లో అమ్మకాలు ప్రారంభించారు.

వెళ్లేందుకు ససేమిరా..

ఇదిలాఉండగా, కొత్త బస్టాండ్ వద్ద రోడ్లు ఆక్రమించుకొని పూలు, టీస్టాల్, చెరుకు, పాన్‌షాప్ దుకాణాలను అక్కడి నుంచి తొలగించాలని కమిషనర్ సూచించారు. ఇక్కడే తమ వ్యాపారాలు కొనసాగిస్తామని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది దుకాణాలు తొలగించేందుకు యత్నించగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలోనే మున్సిపల్ కార్మికులపై చిరువ్యాపారులు దాడికి పాల్పడారు. అలాగే, దుకాణాల తరలింపునకు నిరసనగా రోడ్డు రాస్తారోకో చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని విరమించారు. ఎట్టకేలకు దుకాణలను తొలగించారు. ప్రతి ఒక్కరు సహకరించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరపాలని కమిషనర్ తెలిపారు. ఇదిలాఉండగా, దాడి నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మార్కెట్‌లోకి కొత్త మాడల్ వెర్నా విడుదల



కారును విడుదల చేస్తున్న సీఈఓలు

పాలమూరు: హ్యుందాయ్ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి మరో కొత్త కారును విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని ట్రెండ్ హ్యుందాయ్ షోరూంలో శుక్రవారం కొత్త మాడల్ వెర్నా కారును సంస్థ సీఈఓ గట్టు సిరిచందనరెడ్డి, మార్కెటింగ్ సీఈవో గట్టు హర్షిత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన తయారీలో హ్యుందాయ్ మోటార్ ఇండియా మధ్యస్థాయి సెడాన్ కొత్త వెర్నా ప్రవేశపెట్టిందన్నారు. సరికొత్త హంగులతో విడుదలైన ఈ కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్స్, 30రకాల భద్రత అంశాలు, 17రకాల లెవెల్-2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ ఉన్నాయని తెలిపారు. ఎక్స్‌షోరూం ధర రూ.10.89లక్షలు నుంచి రూ.17.37లక్షల వరకు అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ వశీం పాల్గొన్నారు.

పులి సంచారంపై వదంతులు నమ్మొద్దు


సోమశిల సమీపంలోని అటవీ ప్రాంతంలో కెమెరాను అమరుస్తున్న అటవీశాఖ అధికారులు

కొల్లాపూర్: సోమశిల పరిసర ప్రాంతాల్లో నల్లమల అడవిలో పులి సంచరిస్తున్నట్లు వస్తున్న వదంతులను నమ్మొద్దని కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ శరత్ చంద్రారెడ్డి తెలిపారు. మార్చి 6వ తేదీన ఏపీలోని నంద్యాల జిల్లా పెద్దగుమ్మడాపురంలో నాలుగు పులిపిల్లలు దొరికిన సంగతి తెలిసిందే. వాటి తల్లి పిల్లల కోసం సంచరిస్తూ కృష్ణానది దాటి సోమశిల ప్రాంతంలోకి వచ్చిందనే ప్రచారంపై రేంజర్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కృష్ణానది దాటి తెలంగాణ ప్రాంతంలోకి పులి వచ్చి ఉంటుందనేది అనుమానాలు మాత్రమేనని, పులి ఇటువైపుగా వచ్చినట్లు ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. పులి వచ్చినట్లు ప్రచారం ఉండడంతో నల్లమల అడవిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా రికార్డింగ్‌లను పరిశీలించినట్లు తెలిపారు. ఎక్కడా పులి జాడలు కనిపించలేదని తెలిపారు. సోమశిల, అమరగిరి పరిసర ప్రాంతాల్లో కూడా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏటీఆర్ బయాలజిస్టు మహేందర్ సాయంతో మొత్తం 10 ప్రాంతాల్లో కెమెరాలు పెట్టినట్లు తెలిపారు. తీర ప్రాంతాల్లో, నల్లమల పరిసర ప్రాంతాల్లో పులిజాడలు గమనిస్తే తమకు సమాచారం తెలియజేయాలని, అనుమతి లేకుండా ఎవరూ అడవిలోకి ప్రవేశించరాదని ఆయన సూచించారు.

సేంద్రియ ఎరువుల్లో పోషకాలు


వర్మీ కంపోస్టు ఎరువు


జీలుగ ఎరువు


కోళ్ల ఎరువు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం బాగా పెరిగింది. దీంతో నేల తన సహజత్వాన్ని కోల్పోయి, భూసారం క్షీణిస్తుంది. అనుకున్న స్థాయిలో పంటల దిగుబడి రాక నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. పంట ఉత్పత్తుల్లోనూ రసాయానికి ఎరువులు, పురుగు మందుల అవశేషాలు ఉండి ప్రజా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితుల్లో నేల సంరక్షణకు సేంద్రియ పోషకాల అవసరం ఎక్కువగా ఉంటుందని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు తగ్గించి వాటి స్థానంలో పశువులు, గొర్రెలు, మేకల, కోళ్ల ఎరువులు, వేప కానుగలాంటి వృక్ష సంబంధిత, వర్మీ కంపోస్టు, పచ్చిరొట్టె ఎరువులు వేయాలి. భూమిలో పోషకాల లభ్యతకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. సేంద్రియ ఎరువుల్లో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాష్ శాతం ఎంత ఉందని తెలుసుకోవాలి. దీన్ని బట్టి సేంద్రియ ఎరువులు పంటకు వేయాలి. ఇలా చేయడం వలన భూమి సారవంతం కావడంతో పాటు పెట్టుబడి తగ్గి పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

సేంద్రియ ఎరువుల్లో పోషకాల శాతం

సేంద్రియ ఎరువులు	నత్రజని	భాస్వరం	పొటాష్
పశువుల ఎరువు	1.5	0.9	1.9
కోళ్ల ఎరువులు	3.0	2.0	2.0
గొర్రెల/మేకల	0.7	0.6	3.0
వర్మీ కంపోస్టు	3.0	2.2	1.7
చెరుకు మడ్డి	1.5	4.5	7.0
గోబర్ గ్యాస్ ప్లాంట్	2.4	1.5	1.0
గ్రామీణ కంపోస్టు	1.0	0.8	1.2
పట్టణ కంపోస్టు	2.0	3.3	2.0
వేరుశనగ పిండి, చెక్క	7.5	1.3	1.5
వేప పిండి	5.6	1.1	1.5
ఆముదం పిండి	4.4	1.9	1.4
కానుగ పిండి	4.0	1.0	1.4
పత్తి గింజల పిండి	3.6	2.5	1.6
పంది ఎరువు	3.75	3.13	2.5
జీలుగ	0.62	0.15	0.46
జనుము	0.75	0.12	0.15
చేపల పొట్టు	4.1	3.1	0.3
అలసంద	0.71	0.15	0.58
పిల్లి పెసర	0.72	0.10	0.53

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కల్వకుర్తి టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన సాయిపవన్ రెడ్డి (26) చదువు పూర్తయిన నాటి నుంచి ఇంటి వద్దే ఉంటూ సొంత వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ ఆదివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా తన బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. వెంటనే కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 18మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి నగదు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో చేసిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 19మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. అందరిని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఇద్దరికి రూ.4వేలు, మరో ఇద్దరికి 3వేలు, ఏడుగురికి కలిపి రూ.2500, మరో ఏడుగురికి రూ.2వేల జరిమానా విధించగా, ఒకరికి రూ.2,500జరిమానాతో పాటు ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఆలయ హుండీ చోరీ



మిడ్జిల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పగులగొట్టి నగదు, కంచు దీపం, కుందలు ఎత్తుకెళ్లిన పూజారి యుగంధర్‌స్వామి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హుండీని గత వారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. పెద్దగా నగదు ఉండదని ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న బస్సు

- ఆరుగురికి స్వల్ప గాయాలు

గద్వాల క్రైం: ఆటోను బస్సు ఢీకొన్న సంఘటనలో ఆరుగురికి స్వల్ప గాయాలైనట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మల్దకల్ మండలం పాల్వాయి చెందిన ఆటోలో పని నిమిత్తం గద్వాలకు కొంతమంది వస్తున్నారు. గద్వాల నుంచి పాల్వాయి మీదుగా వెళ్తున్న ఆర్టీసీ ప్రైవేట్ బస్సు కొండపల్లి స్టేజీ సమీపంలో ఓవర్ టేక్ చేసే క్రమంలో ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బొల్తా పడింది. మహేశ్వరమ్మ, మార్తమ్మ, రంగన్న, రవి, పద్మమ్మ, చిన్న మునిస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మునిస్వామి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ రమేష్‌గౌడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు బెదిరింపు కాల్

కోడేరు: ఉన్నతాధికారినని అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 22నుంచి నేను ఉన్నతాధికారి మాట్లాడుతున్నానని సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే కేంద్రాల వద్దకు వచ్చి పిల్లలను కిడ్నాప్ చేస్తానని 9648843790 నుంచి ఫోన్‌చేసి బెదిరిస్తున్నాడని చెప్పారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యాత్రికులు, హోటల్ నిర్వాహకుల మధ్య ఘర్షణ

మన్ననూర్: యాత్రికులు, హోటల్ నిర్వాహకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో యాత్రికులకు గాయాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి సమక్షంలో దోమలపెంట ఎస్‌ఐ కృష్ణదేవ, శ్రీనివాస్ విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా మదనాపురం చెందిన నవీన్ తన కుటుంబంతో కలిసి శ్రీశైలం దర్శనం చేసుకుని, తిరుగు ప్రయాణంలో వటువర్లపల్లిలో ఓ హోటల్‌లో రాత్రి భోజనం చేశారు. ఈ క్రమంలో పెరుగు అవసరమని పక్కనే ఉన్న రవి హోటల్‌కు వెళ్లి తీసుకున్నారు. ధర ఎక్కువగా ఉండడంతో పాటు కాలం చెల్లినది ఇచ్చారని పద్మమ్మపై యాత్రికులు చేయి చేసుకున్నారు. దీంతో ఆవేశానికి గురైన పద్మమ్మ కుమారులు అక్కడికి రావడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పిడి గుద్దులకు తెగబడ్డారు. విచారణ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్టేట్ హోంకు ముగ్గురు విద్యార్థుల తరలింపు

గద్వాల క్రైం: ముగ్గురు విద్యార్థులను శుక్రవారం స్టేట్ హోంకు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన జిల్లా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు తోటి స్నేహితుడి తలపై రాయితో కొట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. శుక్రవారం గద్వాల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి స్టేట్ హోంకు తరలించాల్సింగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


కుర్వ మల్లేష్‌ను పోలీస్‌స్టేషన్ తరలిస్తున్న పోలీసులు

- దేవరకద్రలో ఉద్రిక్తత

దేవరకద్ర: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రానికి చెందిన పెంటమీది వీరప్ప(23) శుక్రవారం ఉదయం స్థానిక రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకోడానికి ఓ వ్యక్తి బెదిరింపులే కారణమంటూ అతని ఇంటిపై కుటుంబ సభ్యులతో పాటు కాలనీప్రజలు పెద్ద ఎత్తున దాడికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలో దిగారు. భూత్పూర్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ భగవంతరెడ్డి, మరి కొందరు సిబ్బంది అక్కడికి చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న కుర్వ మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, ప్రజలకు తోపులాట జరిగి మరోసారి ఉద్రిక్తత నెలకొంది.

మృతదేహంతో ధర్నా

మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహాన్ని ఉంచారు. పోలీసులు వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కేసుపై విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు.

అందంగా లేనని యువకుడి బలవన్మరణం

నారాయణపేట రూరల్: ఎత్తు పళ్లతో అందవిహీనంగా ఉన్నానని బాధ పడుతూ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొల్లంపల్లి పంచాయతీ నల్లగుట్టతండాకు చెందిన సురేష్ (23) ఇంటర్ వరకు చదువుకుని గ్రామంలోని తమ పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. కొంత కాలంగా తన నోటి పళ్ల విషయంలో ఉబ్బెత్తుగా ఉండటంతో అందవిహీనంగా కనిపిస్తున్నాని ఇంట్లో పలుమార్లు చెప్తూ బాధపడేవాడు. దీన్ని మనుసులో ఉంచుకుని గురువారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిని కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాగ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు..

గట్టు: మండలంలోని పెంచికలపాడుకు చెందిన జంగిలప్ప (73) శుక్రవారం కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జంగిలప్ప కడుపు నొప్పి భరించలేక శుక్రవారం ఉదయం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాంచందర్‌జీ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన అశోక్ (25) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం మద్యం మత్తులో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు అతన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్‌కు తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియవని కుటుంబసభ్యులు తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అది దొంగల రాజ్యం...

ఆధారాలతో చంద్రబాబు మరో భారీ దోపిడీ బట్టబయలు
శాసనసభలో సీఎం వైఎస్ జగన్ వెల్లడి

సాక్షి, అమరావతి : 'అమరావతిలో సచివాలయం, శాసనసభ, న్యాయస్థానం భవన నిర్మాణాల్లో చంద్రబాబు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కాంట్రాక్టు సంస్థలను బెదిరించి మరీ భారీ వసూళ్లు చేశారు. తన మనుషుల ద్వారా బోగస్ కంపెనీలు సృష్టించి సబ్ కాంట్రాక్టుల రూపంలో నిధులు కొల్లగొట్టారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇది మనం చెబుతోంది కాదు. ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో బట్టబయలైన అవినీతి బాగోతం. ఐటీ శాఖ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడించిన వాస్తవం' అని వెల్లడించారు. 'అమరావతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తే ఈ అవినీతి బండారం బయట పడింది. అందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అమరావతి నిర్మాణాల విషయంలో చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన అంశంపై శాసనసభలో శుక్రవారం నిర్వహించిన చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. 'చంద్రబాబు తమను బెదిరించడంతోనే ఆయన చెప్పిన బోగస్ కంపెనీలకు నిధులు మళ్లించామని షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. మరో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి తామే నిధులు వసూలు చేసి, చంద్రబాబుకు అందించామని వెల్లడించార'ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నిధులను కొల్లగొట్టిన తీరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇలా వివరించారు.


చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు

ఐటీ దాడులతో వెలుగులోకి..

- మొట్టమొదటగా ఆదాయ పన్ను శాఖ (ఐటీ శాఖ) అధికారులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ నివాసంలో 2019 నవంబర్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడ మొత్తం సమాచారం లభించింది. ఆ తర్వాత 2020 ఫిబ్రవరిలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ నివాసంలో సోదాలు చేశారు. దాంతో మరింత సమాచారం లభించింది.
- ఆదాయ పన్ను శాఖ పరిశోధన విభాగం ఆ మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి ఆదాయ పన్ను అప్రైజల్ రిపోర్ట్‌ను తయారు చేసింది. తాము నిర్వహించిన దాడుల్లో లభించిన ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తులను పిలిపించారు. తాము సేకరించిన ఆధారాలను ఆ వ్యక్తులకు చూపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఆ వాంగ్మూలాలపై వారు సంతకాలు కూడా పెట్టారు. వాటన్నింటి ఆధారంగా ఐటీ అధికారులు చంద్రబాబుకు ఇప్పుడు నోటీసులు పంపారు.

చంద్రబాబు అవినీతి బాగోతం ఇలా..

- అమరావతిలో నిర్మాణాల కంట్రాక్టుల్లో చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు. అందుకోసం పక్కాగా స్కెచ్ వేశారు. 2019 జనవరి, ఫిబ్రవరిలో చంద్రబాబు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్‌ను పిలిపించుకుని తన పీఏ శ్రీనివాస్‌ను కలవమని చెప్పారు. దాంతో మనోజ్.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ను కలిశారు.
- షాపూర్జీ పల్లోంజీ కంపెనీ కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదారిల్లో టిడ్కో ఇళ్లు, అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణంతో పాటు రాజధానిలో ఇతర నిర్మాణ పనులను కలిపి 2018 నాటికి రూ.8 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్ట్ పనులు చేసింది. అందులో తన కమీషన్లు వసూలు చేసేందుకు బాబు.. శ్రీనివాస్‌ను రంగంలోకి దింపారు. వినయ్ నంగల్లా, విక్కీ జైన్ అనే ఇద్దరిని మనోజ్‌కు శ్రీనివాస్ అటాచ్ చేశారు. వీరిలో వినయ్ నంగల్లా మూడు కంపెనీలు, విక్కీ జైన్ రెండు కంపెనీలు సృష్టించారు. ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇవ్వమన్నారు. వాళ్ల నుంచి తాము డబ్బులు తీసుకుంటామని చంద్రబాబు పీఏ శ్రీనివాస్ మనోజ్‌తో చెప్పారు.
- దాంతో వినయ్ నంగల్లా హయగ్రీవమ్, అన్నై షలాఖా అనే కంపెనీలను మనోజ్‌కు అటాచ్ చేశారు. విక్కీ జైన్.. నయోలిన్, ఎవరెట్ అనే రెండు కంపెనీలను అటాచ్ చేశారు. మనోజ్‌కు వాళ్లెవరో కూడా తెలియదు. తాము ఇలా డబ్బులు ఇవ్వలేమని, కావాలంటే పార్టీకి ఫండ్ ఇస్తామని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ చెప్పింది. తాము చెప్పినట్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మనోజ్‌ను శ్రీనివాస్ బెదిరించారు. ఆ విషయాన్ని మనోజ్ ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా వెల్లడించారు. ఆ వాంగ్మూలం కాపీలు కూడా ఉన్నాయి.
- ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇచ్చిన తర్వాత వాటిని వసూలు చేసి చంద్రబాబుకు అప్పగించే బాధ్యతను ఆర్వీఆర్ రఘు, కృష్ణ, నారాయణ్, శ్రీకాంత్, అనికేత్ బలోటాలకు అప్పగించారు. ఇదీ ఈ మోడస్ ఆఫ్ ఆపరెండీ. ఐటీ అధికారులు ఈ సమాచారాన్ని అంతా ఆ కంపెనీల ప్రతినిధుల నుంచి వాంగ్మూలంగా తీసుకుని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ తయారు చేశారు. దాన్ని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చూపించారు. అదంతా వాస్తవమేనని శ్రీనివాస్ అంగీకరించి సంతకాలు కూడా చేశారు.
- శ్రీనివాస్‌తోపాటు రఘు, మిగిలిన వారిని కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. వాళ్లు కూడా అదంతా వాస్తవమేనని అంగీకరించి సంతకాలు కూడా చేశారని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడిస్తోంది.
- చంద్రబాబుకు దుబాయిలో కూడా రూ.15.14 కోట్లను దినార్ల రూపంలో క్యాష్‌గా ఇచ్చినట్టు ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో మనోజ్ అంగీకరించారు. దాంతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కూడా చంద్రబాబుకు ఇలానే మూడు నెలల్లో రూ.371 కోట్లు అందాయి. ఆ కుంభకోణంలో చంద్రబాబుకు డబ్బులు చేర్చిన యోగేశ్ గుప్తానే ఈ వ్యవహారంలో కూడా ఉన్నారు.

ఇది రూ.2 వేల కోట్ల దోపిడీ

- ఐటీ అధికారులు విశాఖపట్నం, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై జరిపిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ.రెండు వేల కోట్లు దొరికినట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ 2020 ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో వెల్లడించింది. 40 చోట్ల జరిపిన తనిఖీల్లో బోగస్ సబ్ కాంట్రాక్ట్ కంపెనీలు, ఇన్వాయిస్లు, బిల్లులు ఇతర ఆధారాలు లభించాయని చెప్పింది.
- రెండో దశ దర్యాప్తులో భాగంగా ఐటీ అధికారులు 2022 సెప్టెంబర్ 28న చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. ఈ కేసును డీసీపీసీ–సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో త్వరలో చంద్రబాబును కూడా విచారణకు పిలవనున్నారు.
- 2019లో అర్జంటుగా డబ్బులు ఇవ్వాలని మనోజ్ వాసుదేవ్‌కు చంద్రబాబు చెప్పారు. హయగ్రీవా, అన్నై షలాఖా అనే సంస్థలకు రూ.52.50 కోట్లు.. నవోలిన్, ఎవరెట్ కంపెనీలకు రూ.62.90 కోట్లు చొప్పున మనోజ్ చెల్లించారు. చంద్రబాబు ఆదేశాలతో మనోజ్.. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఇప్పించారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు అతుల్ సోని, బాల వెంకటేశ్ ఫినిక్స్ ఇన్‌ఫ్రా, పోర్ ట్రేడింగ్, లక్ స్టోన్ అండ్ కో బోగస్ కంపెనీల ఖాతాల్లో రూ.41.90 కోట్లు జమ చేశారు. మొత్తం రూ.157.3 కోట్లు మళ్లించారు.
- ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్వీఆర్ రఘుతోపాటు కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, అనికెత్ బల్డోటాలకు ఈ రూ.157.3 కోట్లు చేరాయి. వారు ఆ నిధులను నేరుగా చంద్రబాబుకు చేర్చారు. ఈ వ్యవహారంలో నారా లోకేశ్ పీఏ రాజేశ్ కిలారి కీలక పాత్ర పోషించారు.


కోట్ల మళ్లింపునకు కోడ్ భాష

- ఆర్వీఆర్ రఘు వాట్సాప్ చాట్‌లను ఐటీ అధికారులు పరిశీలించగా.. ఈ అక్రమ ఆర్థిక లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మనోజ్ వాసుదేవ్ సన్నిహితుడు యోగేశ్ గుప్తా నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నిధుల మళ్లింపులో కూడా యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. బోగస్ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో ఆయనదే ప్రధాన భూమిక.
- ఈ అక్రమ లావాదేవీలను మనోజ్ కోడ్ భాషలో తన ఈ–మెయిల్ ఐడీకే మెయిల్ చేసుకుని భద్రపరిచినట్టుగా ఐటీ అధికారులు గుర్తించారు. ఎవరెవరికి ఎంతెంత మొత్తం చెల్లించింది కోడ్ భాష 'టన్నుల' రూపంలో పేర్కొన్నట్టుగా పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 3 టన్నులు, ఢిల్లీకి 3 టన్నులు, ముంబాయికి 3.5 టన్నులు.. ఇలా భారీగా నిధులను మళ్లించిన గుట్టును ఐటీ అధికారులు ఛేదించారు.

ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్

- ఇంతకు ముందు కూడా ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్. అప్పటి ప్రభుత్వం కన్నా అప్పుల గ్రోత్ రేటు ఇప్పుడు తక్కువ. ఇదే బడ్జెట్‌తో మన ప్రభుత్వం నేరుగా బటన్ నొక్కి డీబీటీ ద్వారా ప్రతి అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్లు పూర్తికాక ముందే మన ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసింది. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా బటన్ నొక్కిన వెంటనే అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి.
- ఇంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇదే బడ్జెట్. అయినప్పటికీ ఎందుకు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, వారి కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లలేదు? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ స్కీం ఎలా చేశారో మొన్న కూడా చెప్పాం. ఈ రోజు మళ్లీ చెబుతున్నాం. గత ప్రభుత్వం ఎలా ఉండేది.. మనందరి ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఎంత మంచి జరుగుతోందో రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలి.

చంద్రబాబుకు ముడుపులు ఎవరెవరి ద్వారా ఎలా అందాయంటే...



ఈడీ పట్టుకోదనే కేడీ చంద్రబాబు ధీమా

ఇంతగా ప్రజాధనాన్ని కొల్లగొట్టినా, తనను ఏ ఈడీ కూడా పట్టుకోదనే ఈ కేడీ చంద్రబాబు ధీమా. సీమెన్స్ కేసులో రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు ఈ కేసులో రూ.172.44 కోట్లు దోపిడీ చేసినట్లు ఇప్పటిదాకా తేలింది. అమరావతి పేరిట ఏదో చేస్తున్నానని ప్రజలను మభ్యపెడుతూ ఇక్కడ చేసింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోపిడీ ఆధారాలతో బయటకు వచ్చింది. ఇప్పుడు ప్రజలకు ముఖం ఎలా చూపిస్తావ్ చంద్రబాబూ.. అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణానికి చ.అడుగుకు రూ.12 వేలు చొప్పున దోచి పెట్టారు. బాబు దోపిడీలో దోచుకో పంచుకో తినుకో(డీపీటీ) బ్యాచ్‌లోని రామోజీరావుకూ వాటాలు అందాయి.
– గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


కరిష్మా

గద్వాల: పట్టణానికి చెందిన పుట్‌బాల్ క్రీడాకారిణి కరిష్మా జాతీయస్థాయి మహిళా పుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 28 నుంచి వచ్చేనెల 5 వరకు పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్ మహిళా పుట్‌బాల్ పోటీలలో పాల్గొననుంది. గత నెల నిజామాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలలో ఈమె చక్కటి ప్రతిభ కనబరిచింది. 25 రోజుల పాటు అక్కడే శిక్షణ ఇచ్చారు. జాతీయస్థాయి మహిళా పుట్‌బాల్ పోటీలకు ఎంపికపై పుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కోచ్ విజయ్‌కుమార్, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు పీఈటీలు



మహబూబ్‌నగర్ క్రీడలు: మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించే జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు పీఈటీలు ఎంపికయ్యారు. గతేడాది ఆగస్టులో సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో ఎం.ఆనంద్‌కుమార్ (పీఈటీ–జెడ్పీహెచ్ఎస్ పారుపల్లి) షాట్‌పుట్‌లో బంగారు పతకం, మేరీ పుష్ప (పీఈటీ–జెడ్పీహెచ్ఎస్, ఎదిర) డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర, రాజేంద్రకుమార్, సాధిక్‌అలీ, రమేష్‌బాబు, శ్రీనివాసులు, శ్రీనివాస్, దత్తాత్రేయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి దందా

- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


వట్టెం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి దందాతో ఎమ్మెల్యే రూ.కోట్లు కొల్లగొడుతున్నాడని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర శుక్రవారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెం రిజర్వాయర్ నిర్మాణంలో రైతుల భూముల్లో పెద్ద గుంతలు ఏర్పాటు చేసిన నల్లమట్టిని తవ్వారని అన్నారు. ఆ మట్టితో ఎలాంటి ఉపయోగం లేని వట్టెం రిజర్వాయర్‌కు తరలించి, దాని వెనకాల స్థానిక ఎమ్మెల్యే ఎన్ని రూ.వందల కోట్లు సంపాదించారన్నది మేము ప్రజల ముందు ఉంచుతామన్నారు. వట్టెం రిజర్వాయర్ స్థానిక ప్రజలకు కన్నీళ్లే మిగిల్చిందన్నారు. ఎన్‌టీటీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రిజర్వాయర్‌పై రూ.300 కోట్ల జరిమానా విధిస్తే కూడా చెల్లించాల్సిన పరిస్థితి ప్రభుత్వం వద్ద లేదన్నారు. ఈ ప్రాజెక్టులో 200 ఎకరాల మిగులు భూమి పరిహారాన్ని ఎమ్మెల్యే అనుచరులు పంచుకున్నారని, ఈ ప్రాజెక్టులో అణువణువులో అవినీతి దాగిందన్నారు.

ఒక్క ఇల్లు ఇవ్వలేదు

బిజినేపల్లి మండలంలోని వట్టెం చెందిన బాలమ్మ మరుగుదొడ్డి జీవనం సాగిస్తుందని, అలాంటి కుటుంబాలు నియోజకవర్గంలో కనిపించడం విచారకరమని అన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన సొంత గ్రామంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లును కూడా ప్రభుత్వం తరుపున నిర్మించలేదన్నారు. 2016లో రెండున్నర లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్, ఇప్పటి వరకు కేవలం 13వేల ఇండ్లు మాత్రమే నిర్మించారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి కుమార్, నాగన్న, రాంచందర్, రాములమ్మ, రాంచందర్, మహేష్, శివకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జింకను వేటాడిన ఐదుగురికి రిమాండ్

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని బల్మూర్ మండలం కొండనాగుల బీట్ అటవీ ప్రాంతంలో ఈనెల 21న జింకను వేటాడి చంపిన సంఘటనలో ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్వో రాజేందర్ తెలిపారు. బల్మూర్ మండలం లక్ష్మీపల్లి పంచాయతీలోని చెంచుగూడెంకి చెందిన బల్మూరి లింగస్వామి, నిమ్మల లక్ష్మయ్య, నిమ్మల రాజు, నిమ్మల మశన్న, నిమ్మల పెద్ద మశన్న కలిసి మంగళవారం రాత్రి కొండనాగుల ఫారెస్ట్ బీట్ పరిధిలో రామగిరి అడవిలో ఉచ్చులు వేసి జింకను చంపారు. తమకు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించి.. వన్యప్రాణి చట్టం1972 ప్రకారం కేసు నమోదు చేసి శుక్రవారం అచ్చంపేట కోర్టులో హాజరు పరిచినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. వారికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడి చంపడం నేరమని, ఇలాంటి సంఘటనలకు ఎవరైనా పాల్పడితే.. అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

- డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్
- 1వ తేదీన 10వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి పదో బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్‌పై మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్స్ (ఎంఎస్ ఆఫీస్), బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనర్ రిపేర్, మొబైల్ సర్వీసింగ్, రిపేర్ అంశాల్లో, 7వ తరగతి పాసైన వారికి జర్దోసి–మగ్గం, ఎలక్ట్రీషియన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో దరఖాస్తుతోపాటు విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కులం ధ్రువపత్రం ఈనెల 31వ తేదీ వరకు ఇవ్వాలని, వివరాల కోసం శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్.విజయ్‌కుమార్ 9441565895 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ తొలిరోజు ప్రార్థనలు


జామ మసీదులో జుమా నమాజ్ చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. రంజాన్ తొలి శుక్రవారం మసీదులన్నీ ముస్లింలతో కిటకిటలాడాయి. ఈసారి తొలి శుక్రవారం రోజే మొదటి ఉపవాస దీక్ష రావడం విశేషం. మహబూబ్‌నగర్‌తోపాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో జుమా నమాజు చేశారు. శుక్రవారం నమాజులతో మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆవరణలో ఇత్తరు, మిస్వాక్, టోపీలు, ధార్మిక పుస్తకాల స్టాళ్లు వెలిశాయి. జిల్లాకేంద్రంలోని జామ మసీదు, మదీనా, మక్కా, షాసాబ్‌గుట్ట, అన్సార్, గోల్, అలీ, మోతి, రహెమానియ, న్యూప్రేమ్‌నగర్, రైల్వేస్టేషన్ తదితర మసీదుల్లో ముస్లింలు జుమా నమాజు చేశారు. ఇమామ్‌లు రంజాన్ విశిష్టత గురించి వివరించారు. రంజాన్ నెలలో విధిగా జకాత్, ఫిత్ర చెల్లించాలని సూచించారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం

- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం


ఆదర్శ కండక్టర్‌ను సన్మానిస్తున్న ఈడీ

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించి, సంస్థను లాభాల బాటలో నడిపిద్దామని ఈడీ పురుషోత్తం అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగులకు నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈడీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 99 ఆర్టీసీ డిపోలలో 16 మాత్రమే లాభాల్లో, 83 నష్టాల్లో ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేల కోట్ల నష్టంతో డిపోలు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం 100డేస్ ఛాలెంజ్ ఉందని, ఉద్యోగులు, సిబ్బంది కష్టపడి విధులు నిర్వర్తించి డిపోలను లాభాల బాటలో నడిపించాలని కోరారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. అచ్చంపేట డిపో రూ.8కోట్ల నష్టంతో కొనసాగుతుందని, ప్రతి ఒక్కరి కృషితో డిపోను మెరుగుపర్చాలన్నారు. ఇటీవల ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించామని, 300 మంది సిబ్బంది వివిధ రోగాలు ఉన్నట్లు గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం ఆర్ఎం శ్రీదేవి, డిపో మేనేజర్ రాజశేఖర్, సిబ్బందితో 3గంటల పాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, డీటీఓ ఎర్రిస్వామి, సీఐ అనుదీప్, డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, బాబునాయక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో రైతులకు మేలు



ఖిల్లాఘనపురం: రైతులు ఆధునిక పద్ధతులతో సుస్థిర వ్యవసాయం చేయడం వలన ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రగతి, లక్ష్మణ్, ప్రియాంక, పరిమళ కుమార్, ఏడీఏ సత్యంబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లో క్లస్టర్ రైతువేదికలో రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఉన్న భూమిలో ఒకే రకం పంటను సాగు చేయకుండా అన్ని రకాల పంటలు, కోళ్లు, గేదెలు, పండ్ల మొక్కలు సాగు చేయడంతో ఎప్పుడూ నష్టపోరని తెలిపారు. మారుతున్న పద్ధతులను అనుసరిస్తు ఆధునిక వ్యవసాయ పరికరాలను ఉపయోగించాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేయడం వలన మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దచింతరేవుల హుండీ ఆదాయం రూ.11లక్షలు


హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, భక్తులు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. గద్వాల డివిజన్ పరిశీలకురాలు వెంకటేశ్వరమ్మ సమక్షంలో ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఏడాదికిగాను మొత్తం హుండీ ఆదాయం రూ.11.30లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కవిత తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త గిరిరావు, పెద్ద చింతరేవుల, భీంపురం గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నరాజమూర్‌లో..

చిన్నరాజమూర్ హుండీ ఆదాయం రూ.3.45 లక్షలు

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈట ప్రసాద్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా రూ.3,45,995 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ గోపాలచారి, హన్మేషచారి, రామాచారి, భీమాచారి తదితరులు పాల్గొన్నారు.